వేయి ఆలోచనలు సంఘర్షించిన తర్వాత వికసించిన పూలగుత్తిలా ఉంది ఆమె మొహం.

"ఏమిటీ ఇలా వచ్చారు ఈ సమయంలో?" అంది. అతను ఎందుకొచ్చాడో ఆమెకు తెలియకపోలేదు. కానీ మొహంలో ఎప్పటిలాగే అదే ప్రసన్నత. ఎప్పటి మందహాసమే.


ఆ ప్రసన్నతకి రఘురాం బెదిరాడు. అయినా మేకపోతులాగ మొహంపెట్టి, "మాట్లాడవలసిన పని ఉంది!" అన్నాడు.

మాటలు ఏమీ లేవని ఆమెకు తెలుసు. అసలు ఎప్పుడూ లేవు. వ్యవహారాలు ఉండేవి. తామిద్దరి మధ్య ప్రేమ 'వ్యవహారం'లా నడిచింది. పెళ్లి కూడా వ్యవహారమే అయింది. సంసారం సంసారపక్షంగా సాగింది. ఇందులో ఎక్కడా ఏమీ తేడా లేదు. అందరికీ ఆమోదయోగ్యమే. కానీ ఆమెకు తెలుసు ఎక్కడో తప్పటడుగు పడిందని.

ప్రసూనకి 'వ్యవహార' జ్ఞానం లేదు. దానికి ఆమె చెల్లించిన పరిహారం నిరంతర మానసిక సంఘర్షణ.

# జ్ఞాన ప్రసూన

## వాడ్రేవు వీరలక్ష్మీదేవి



మాటలు ఒక్కొక్కసారి ఎంత ప్రాణం పోస్తాయి? ఎన్నటికీ తరగనన్ని మాటలు ఆమెలో ఊటలూరుతూ ఉండేవి.

ఇప్పుడు రఘురాంకి మాట్లాడవలసిన పని ఉందట. అంటే నిజం మాటలు కాదు, 'పని'.

పని ... పని ... పని ...

ప్రసూన ఆలోచిస్తోంది. జీవితమంతా 'పనే'!

"కాసేపు వెన్నెలలో కూర్చుందామా?" అని అడిగేది ఎంతో విహ్వలతో.

"ఈ లెక్కలు పూర్తి చేయాలి. పొద్దున్నకల్లా బాంకులో జమకట్టవలసిన లెక్కలు చూసుకోవాలి. నువ్వు వెళ్లు కావలిస్తే!"

"కాసేపు కబుర్లు చెప్పుకుందామా?" తెల్లటి పక్కమీద పడుకుని అడిగేది.

"ఇప్పుడేం కబుర్లు? పొద్దున్న లేచి పని చూసుకోవాలి, మాట్లాడకుండా పడుకో!"

'పని' అంటే అసహ్యం కలిగేలాంటి సంఘటనలు, సన్నివేశాలు. జీవితమంతా వ్యవహారం, పని ...



పోనీ ఏమిటి సాధించగలిగాడు?

పరిశీలనగా అతన్నే చూస్తూ అనుకుంది ప్రసూన. రెండు ఇళ్లతోపాటు తలమీద వెండి జుట్టు కూడా సంపాదించగలిగాడు.

ఫక్కున నవ్వొచ్చింది ఆమెకు. నవ్వితే అతనికి కోపం వస్తుందన్నది అనుభవైక వేద్యం. భయంతో కాక, దయతో ఆపుకుంది నవ్వుని. ఈవేళ నవ్వినా, ఏమీ చేయలేడు. కోపం ఉడుకుమోత్తనం రూపంలో బయటికి వస్తుంది.

రఘురాం మంచి భర్త. మంచి తండ్రి. కానీ మంచి ప్రేమికుడు కాలేకపోయాడు. రఘురాం సగటు భర్త. ప్రసూనకి ఆ సంగతి ఆలస్యంగా తెలిసింది.

ప్రసూనని చూడగానే రఘురాంలో కోపం, ఇష్టం ఒక్కసారిగా కలిగి పోటీపడ్డాయి. మరింత తెల్లగా, మరింత నాజూకుగా ఉంది ఆమె. శాంతసముద్రంలాంటి ఆమె ప్రసన్నత అతని లోపలి దేన్నో రెచ్చగొడుతోంది. ఉదయం ఇంట్లో వంట చేస్తూండగా చూసినప్పుడు ఇంత అందంగా ఉన్నట్టు లేదే అనుకున్నాడు. ఈ బాంక్‌లో, కాష్ కౌంటర్‌లో ఫాన్ గాలికి కదిలే ముంగురుల మధ్య వెలుగుతున్న ఆమె వదనం ట్యూబ్‌లైట్ వెలుగులో మరింతగా ప్రకాశిస్తోంది.

ఆమె హుందాగా ఉంది, మోహనంగా ఉంది. చకచకా నోట్లు లెక్కపెడుతోంది. ఏకాగ్రతతో పనిచేస్తోంది ఆమె. గంటలు గంటలు వేళ్లమధ్య నోట్లు తిరుగుతున్నా ఎంతో అందంగా ఉంది ఆమె.

పని చెయ్యడంలోని ఆనందం తెలుసుకున్న ప్రసూన; చాలా ఆలస్యంగా తెలుసుకుంది- 'ఆనందం కోల్పోవడం' సంగతి.

ఎంతకీ తెమలకపోవడం చూసి అసహనంతో అడిగాడు - "ఒక గంట పర్మిషన్ పెట్టి, బయటకు రాగలవా?"

"గంట పర్మిషన్ అంటే వర్కింగ్ అవర్స్‌లో చాలా పని ఆగిపోతుంది!" అంది ఆమె.

"నీ స్వంత పనేమైనా ఆగిపోతుందా?"

ఎస్, ఇలాగా మాట్లాడతాడు. స్వంత పనికంటే కమిట్ అయిన పని ఎంత ముఖ్యమో ఇతనికి ఎప్పటికీ తెలియదు. ఎలా చెప్తే అర్థం అవుతుంది ఇతనికి? ఎప్పుడూ అనుకునే మాటే మరోసారి అనుకుంది. అర్థం కాదని రూఢిగా తెలిశాక చాలాకాలంగా చెప్పడం మానేసింది. తోచినట్టు చేయడమే అలవాటు చేసుకుంది. అతనికీ అలవాటు చేసింది.

"ఒక అరగంట వెయిట్ చేయండి. ఈలోగా పూర్తిచేసి వస్తాను!" అని బాగ్‌లోంచి మాగజైన్ తీసి ఇచ్చింది.

అతను దానివైపు చూడనైనా లేదు, చదివే అలవాటు ఎప్పుడో పోయింది. జేబులోంచి వీడియో గేమ్ తీసి నొక్కడం మొదలుపెట్టాడు.

"ష్..! మ్యూజిక్ ఆఫ్‌చేసి ఆడుకోండి!" అని అతనికి ఆమె ఆ ఆఫీసు మేనర్స్ గుర్తు చేయవలసి వచ్చింది.

* * *

ఎం.ఏ. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంటు వరండాలో రఘురాం ఆమెను మొదటిసారిగా చూశాడు.

మంచి పసిమిరంగులోంచి- ఉండీ, ఉండీ మెరుస్తున్న ఆమె మెడలోని బంగారు గొలుసు వింతగా ఆనింది అతని కళ్లకి.

నిగనిగా మెరుస్తున్న నల్లని నొక్కుల జుట్టు పరివేషించి ఉన్న ఆమె మొహంలో ఎవరికోసమో అన్వేషణ. అలాంటి ఆమెను పలకరించకుండా ఎవరైనా ఉండగలిగితే అది వాళ్ల ఖర్మ మాత్రమే.

'ఎవరికోసం?' అని పక్కనున్న మరో అబ్బాయి అడిగాడు ఆమెను.

ప్రసూన అతనికి సమాధానం చెప్పడం మాని, రఘురాంవైపు చూసింది. అప్పటికి గుర్తొచ్చింది అతనికి - ఆమె వాళ్ల ఊరి అమ్మాయే చిన్నప్పుడెప్పుడో చూశాడు.

"మీకోసమేనండీ!" అని, "మీ అడ్రస్ మా మామయ్య ఇచ్చాడు. మిమ్మల్ని కలవమని చెప్పాడు. మీరూ ఇక్కడే చదువుతున్నట్టు నాకు అంతదాకా తెలియదు!" అంది.

ఆమె పొలిటికల్ సైన్స్ ఫైనల్ చదువుతోందట. క్రితం సంవత్సరం అంతా అతని సంగతి తెలియలేదుట. తెలిస్తే ఎప్పుడో కలిసి ఉండేదాన్నని చెప్పింది. అదీ పరిచయం.

రఘురాం తెలివైన విద్యార్థి. సెమినార్‌లో మంచి ఎనాలసిస్‌తో పేపర్లు చదివేవాడు. తన సబ్జెక్ట్ కాకపోయినా, వచ్చి వినేది. అతని ఎనాలసిస్ అంటే ఆమెకు చెప్పరాని కుతూహలం. మన ఊరి అబ్బాయి ఈ యూనివర్సిటీలో ఇంతమంది మధ్య గొప్ప కావడం ఎంత బావుందీ అని సంతోషపడేది.


తరచుగా అభినందిస్తూండేది.

రఘురాంకి ఆమె ఇష్టం తెలిసిపోయేది. కానీ భయం. నలుగురూ ఏమనుకుంటారో! అందరిలోనూ నిర్భయంగా పలకరించేస్తుంది అని.

ఆమె ఏదైనా నలుగురిలోనూ ఉండగానే చెప్పేది కానీ ఒంటరిగా మాట్లాడే అవకాశం ఇచ్చేది కాదు.

అతనికి ఆ ధైర్యం ఏమిటో తెలిసేది కాదు. అలాంటి ధైర్యం రావడానికి ఎంత స్వచ్ఛత ఉండాలో కూడా అతనికి తెలియదు. అర్థం కాదు. కానీ ఆమెలోంచి వెల్లివిరిసే ఉత్సాహం, చురుకుదనం, వాటిని మించిన అందం అతన్ని కదిపాయి.

ఆలోచించి ఆలోచించి ఒక ఉత్తరం రాశాడు. వెంటనే ఆమె జవాబు రాసింది సందేహాలు, సంశయాలు లేని ఇష్టంతో.



## చివరికి విడిపోయార్ట!

**మా**జీ విశ్వసుందరి సుస్మితాసేన్ తన ప్రియుడు, దర్శకుడు విక్రమ్‌భట్ ('గులామ్' ఫేమ్) తో గొడవలొచ్చి విడిపోయిందని కొంతకాలంగా వదంతులు వినపడుతున్నాయి. తెర వెనుక ప్రేయసీప్రియులుగా అంతమంది కళ్లుపడిన ఈ జంట చివరికి తాము ఒకరికోసం ఒకరు పుట్టలేదని (నాట్ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్') గ్రహించి విడిపోయార్ట!

'గులామ్' చిత్రం విజయంతో కళ్లు నెత్తికెక్కే టైపు విక్రమ్ కాదు, మరేదో జరిగుంటుందని సినీజనం చెవులు కొరుక్కుంటున్నారు. అసలు మామూలుగా ప్రేమికుల మధ్య వచ్చే గొడవలేవోననీ అనుకుంటున్నారు. చూడాల్సిందే మరి! ఇదిలా వుండగా విక్రమ్ ఈ ఏడాది మరో నాలుగు కొత్త చిత్రాలు ప్లాన్ చేస్తున్నాడు. 'ములాకాత్' లో రాణీముఖర్జీ హీరోయిన్ అని అందరికీ తెలుసు. తక్కిన మూడింట్లోనే హీరోయిన్లనూ, తదితరులనూ నిర్ణయించాల్సివుంది. విడిపోయినా సేన్‌కు తన చిత్రంలో అవకాశమిస్తాడో లేదో కాలమే నిర్ణయించాలి!

ఎం.ఎ.

పొలిటికల్ సైన్స్ ఎం.ఎ. చేసిన ప్రసూన అతి త్వరలో బాంక్ ఉద్యోగిని అయింది. రఘురాంకంటే ముందే ఉద్యోగం సంపాదించగలిగింది. ఇది అతనికే రావలసిన ఉద్యోగం. అలా కాక, తనకి రావడం లక్ తప్ప మరేమీ కాదు అనుకునేది.

పార్ట్ టైమ్ లెక్చరర్‌గా చేరిన రఘురాం క్రమంగా నిలదొక్కుకున్నాడు.

పెళ్లి, పిల్లలు, ఇరవై ఏళ్ల సంసార జీవితం ... ఆలోచిస్తే అన్నీ అమరిన జీవితం. స్పందనే మిగిలింది కాదు.

● ● ●

ప్రసూన నిట్టూర్చి లేచింది.

జైలులాంటి కాష్ కౌంటర్‌లోంచి బయటకు వచ్చింది. కనిపించే జైళ్లు జైళ్లు కాదనడానికి ఇదే ఒక ఉదాహరణ. ఎన్నో ఏళ్లుగా కనిపించని జైలులో చిక్కుకుపోయింది. ఇప్పుడు ఈ సన్నటి కటకటాల మధ్య ఉండి ఎంతో హాయిగా పనిచేస్తోంది.

వీడియో గేమ్ జేబులో పెట్టుకుని రఘురాం ఆమెను అనుసరించాడు. బాంకు ఆవరణలోకి రాగానే ఆమె తన స్కూటర్ తియ్యబోయింది.

"అదెందుకు? నా స్కూటర్ తెచ్చాను!" అన్నాడు.

ఏళ్ల తరబడి అతని వెనకాల ఆ స్కూటర్‌మీదే తిరిగింది ఆమె. అతని భుజంమీద చెయ్యి వేసి, ఎంతో ఇష్టంతో, అతని సామీప్యాన్ని వదలలేనట్టుగా.

ఇద్దరూ విడివిడిగా బయలుదేరితే పెట్రోలు దండగ అని ఇప్పుడు తన వెంట రమ్మంటున్నాడని ఆమెకు తెలుసు. ఆలస్యంగానైనా సరే ఆ స్వభావం అర్థం అయింది కదా! ఇంకా ఎలా ఉంటుంది పూర్వంలాగా? అతని మాట వినిపించుకోకుండా తన టూ వీలర్ తీసింది.

"ఎక్కడికి?" అని అడిగి, మళ్లీ తనే, "ఏదైనా హోటల్‌కి వెళ్దాం, పదండీ!" అంది.

"ఇప్పుడు మళ్లీ హోటల్‌కి ఎందుకూ?" అని నసిగి, "సరే, పద!" అన్నాడు.

ఉదయంపూట స్థిమితంగా భోజనం చెయ్యడం ఎప్పుడూ కుదరదు ఆమెకు. ఇంత పని చేశాక ఆకలవుతుంది. ఏదైనా తింటే బాగుండునని ఉంది. అంత చిన్న విషయం అతనికి తట్టదు.

టిఫిన్ తింటూండగా నెమ్మదిగా చెప్పాడు -

ఉదయం కాలేజీకి ఒక మంచి పార్టీ వచ్చారుట. ఇంటికి దాదాపు అయిదు లక్షలదాకా పలకవచ్చుట. ఆమె సంతకం పెట్టేస్తే చాలు, అన్ని వ్యవహారాలూ త్వరగా అయిపోతాయి.

ప్రసూన తుంపిన ఇడ్లీ ముక్క చేత్తో పట్టుకుని ఒక్క క్షణం అంటే ఒక్క క్షణమే ఆగింది. రెండో క్షణంలో ఇలా అంది -

"టిఫిన్ పూర్తిగా తిన్నాక చెయ్యి కడుక్కుని పెట్టవచ్చా, లేకపోతే ఇప్పుడే ఇలాగే చెయ్యి కడుక్కుని పెట్టెయ్యనా?"

రఘురాంకి చర్‌మని కోపం వచ్చేసింది. సమయం కాదని తమాయించుకున్నాడు.

"ఇష్టం లేదన్న విషయాన్ని చాలా తెలివిగా చెప్తున్నావు!" అన్నాడు.

నవ్వుకుంది ప్రసూన. 'తనకి తెలివి ఉంది కానీ, అతి తెలివి లేదు. తెలివిని హృదయంలో రంగరించి ఉపయోగించగలగడమే తనకి తెలుసు. కానీ ఇప్పుడిప్పుడు 'జ్ఞానం' అంటారే అది కొంత వస్తున్నట్లుంది. ఎస్, దాన్ని సంపాదించాలి, సంపాదించి తీరాలి!' అనుకుంది తన మనసులో.

"నాకు ఇష్టం కాని పని చేస్తున్నానని మీకూ తెలుసునన్నమాట! నా ఇష్టంతో అయిష్టంతో సంబంధం లేదు. మీరు అడిగారు, అంతే! ఎస్ అంటున్నాను!" అంటూ టిఫిన్ తినడం పూర్తిచేసి లేచి సింక్ దగ్గరకి వెళ్లింది. చేతిమీదకి కుళాయిలోంచి నీళ్లు పడుతున్నాయి.

కన్నీళ్లు ఆగడంలేదు. ఇప్పుడు అమ్ముతున్నది ఇల్లా? దాన్ని తాను ఇటుకలూ, సిమెంటుతో కట్టిన ఇల్లుగా ఏనాడూ భావించలేదు. అది తన ప్రేమ హరివిల్లు, బృందావనం, నందనవనం, పారిజాత సుమాల పొదరిల్లు! అంతా పిచ్చి! ట్రాష్! తమ ప్రేమ కాదు. ప్రేమ తనది మాత్రమే, వ్యాపారం అతనిది. బావుంది ఈ ఆట!

కన్నీళ్లు తుడుచుకుంటూ అనుకుంది 'తప్పదు, ఈ కాసిని కన్నీళ్లు తనలో ఇంకిపోకూడదు. అదే జరిగితే ఈ పువ్వుకి పరిమళమే పోతుంది. ఈ కన్నీళ్లు బలహీనతకి చిహ్నం కాదు, తనలోని సువాసన.' కాంతిని దయగా మార్చి కురిపించే ఆమె కళ్లు తడిసిన పారిజాతాలలాగా మరింత స్వచ్ఛమయ్యాయి.

చెయ్యి తుడుచుకుంటూ వచ్చి కూర్చుని బాగ్‌లోంచి పెన్ తీయబోయింది. అతను అప్పటికే కాగితాలు, పెన్ను తెరిచి సిద్ధం చేసుకుని ఉన్నాడు.

నవ్వుతూనే సంతకం పెట్టింది.

ఇప్పుడు ఈ అమ్మగా వచ్చిన డబ్బుతో అయిదు లక్షల రూపాయలకి షేర్లు! రఘురాం తెలివితక్కువవాడు కాదు. అర్థశాస్త్రంలో ప్రవీణుడు. అతని ఎనాలసిస్‌కి ఆమె చకితురాలయ్యేది చదువుకునే రోజుల్లో.

ఇష్టం ... అతని తెలివిపట్ల ఎంతో ఇష్టం.

అంత తెలివైన వాడికి భార్య కావడం ఎంత భాగ్యం! అతనికి సేవ చేయడం ఎంత గొప్ప యోగం?! అనుకుంది.

మామిడి పళ్లు తొక్క తీసి చిన్నచిన్న ముక్కలు

కోసి గాజుగిన్నెలో పోసి ఫోర్కు గుచ్చి ఎంతో సుఖంగా, సౌకర్యంగా తినే వీలుతో అందించడంలో ఎంత ఆనందపడేది ప్రసూన!

సేవించడం, ప్రేమించినవాడిని సేవించడం, వాడికోసం చేసే పనిలో ఆనందం, ఆ మత్తులో కొద్ది నెలలు గడవకముందే ఒక్కొక్క అపశృతిని ఆమె హృదయం గుర్తించడం మొదలుపెట్టింది.

'హృదయం నుంచి బుద్ధికి అందడానికే ఇంత టైము పట్టింది!' అనుకుని లేచింది, కుర్చీలోంచి.,

"పని అయినట్టేగా, ఇక వెళ్దాం!" అంది.

రఘు ఉత్సాహంలోకి వచ్చి పడ్డాడు. "ఉండవోయ్, మంచి కూల్‌డ్రింక్ తాగుదాం!" అన్నాడు.

'తనకు కూల్‌డ్రింక్ ఇష్టం కాదని తెలీదూ, ఇతనికి?' అనుకుని, "మీరు తాగండి, కూర్చుంటాను!" అంది తిరిగి కూర్చుంటూ.

చాలా హేపీగా కూల్‌డ్రింక్ తాగి లేచి, "నువ్వు వెళ్ళిపోగలవు కదా, నేను ఇట్నించి ఇటే వెళ్ళిపోవాలి!" అన్నాడు.

చిరునవ్వుతో బయటకు దారితీసింది.

ప్రతిచోటకీ అతనితోనే కలిసి వెళ్ళాలని, అతన్నే దిగబెట్టమనేది. ప్రతి చిన్న వస్తువూ అతనిచేతి మీదుగానే రావాలని అతన్నే కొనమనేది. పిల్లలు పుట్టాక వాళ్ళు ఎదుగుతూంటే క్రమంగా అర్థమవడం మొదలుపెట్టింది - తన ఇంత ప్రేమనూ అతను ఏ విధంగా రిసీవ్ చేసుకున్నదీనూ.

'మీ అమ్మకి ఏదీ చేతకాదు!' అని అతను మొదటిసారి పిల్లలతో అన్నప్పుడు ప్రసూన షాక్ అయింది. పదే పదే ఆ మాటలు వినవలసి వచ్చినప్పుడు ఆమె క్రమంగా బోధపరచుకోవడం మొదలుపెట్టింది. హృదయం ఎందుకు విలవిలలాడేదో, క్రమంగా అక్కడ తూట్లు ఎందుకు మిగిలిపోయాయో ప్రసూనకి ఇప్పుడు తెలుసు. కానీ ఆ గాయాలు ఆమెను ఈనాడు బాధించవు. తిరిగి అటువంటి గాయాలు కాకుండా తనను తను రక్షించుకోవడం ఎలాగో తెలుసుకుంది.

బండి తాళం తీసి నాలుగవ గేర్‌లో రాజపథంమీద పరుగుపెట్టించింది.

❀ ❀ ❀

సాయంత్రం రఘు చాలా పెందరాళే ఇంటికి చేరాడు. చాలా సంతోషంగా ఉన్నాడు.

అయిదు లక్షల పెట్టుబడితో అతి తక్కువ సమయంలో పది లక్షలు సంపాదించగలుగుతున్నాడు. మళ్ళీ సంవత్సరం కారు కొంటాడు, ఆ కారులో ఇద్దరం తిరుగుతామా? అని ఆలోచిస్తూ డాబా ఎక్కింది ప్రసూన.

ఈ డాబా ఒంటరిగా ఉంటుంది. తను ఎప్పుడూ ఒంటరిగానే వచ్చి ఇక్కడ గడుపుతుంది.

రఘురాం పేరుతో.ఉన్న ఈ ఇంట్లోనే ఇకనుంచి తాము ఉంటారు. ఇక ఆ ఇంటికి వెళ్ళే వీలు లేదు. తన పేరనున్న ఆ ఇల్లు లేదు. అది బిజినెస్‌లోకి వెళ్ళిపోయింది. రఘురాం తెలివైనవాడు. అతని పేర ఉన్న ఇల్లు అమ్మలేదు, కారణాలు చాలా చెప్తాడు. తనకెందుకవి?

తన ఇల్లు అమ్మినా, ఇప్పుడు తనకి భయం లేదు అనుకుంది ఆమె. ఈవేళ రఘురాం నాకు భయపడతాడు. అతని నుంచి నేను చాలా దూరం వచ్చేశాను అనుకుంది.

'అతన్ని పిచ్చిగా ప్రేమించడంలో నా అస్తిత్వం పోగొట్టుకోబోయాను. అతను నా ప్రేమను అందుకోగల శక్తిమంతుడైతే తిరిగి నా అస్తిత్వాన్ని గౌరవంగా, పదిలంగా నాకే అందించి


TELEGRAM : SHAKKAR

TELEPHONES { OFFICE : 23763 / FACTORY : 22582

WITH BEST COMPLIMENTS

FROM :-

THE CHITTOOR CO-OPERATIVE SUGARS LIMITED : : CHITTOOR.

ANDHRA PRADESH

MANUFACTURERS OF

BEST QUALITY WHITE CRYSTAL SUGAR

L. PREMACHANDRA REDDY, I.A.S.,
JOINT COLLECTOR/PERSON IN CHARGE

K.B. VENKAT RAO,
MANAGING DIRECTOR.

NAG-98



## టీ.వీ. సీరియల్‌కు కొత్తరికార్డు!

ప్రతి ఆదివారం మధ్యాహ్నం పన్నెండు గంటలకు దూరదర్శన్‌లో జాతీయకార్యక్రమాల్లో 'అమర్ చిత్రకథ' వారి పురాణకథలు సీరియల్‌గా ప్రసారమవుతున్నాయి. అదిప్పుడు మెగా సీరియల్‌గా హిట్టయింది. ఇంతకు ముందు భారతీయ దూరదర్శన్ కార్యక్రమాల్లో వేటిలోనూ లేని స్పెషల్ ఇఫెక్ట్ దీంట్లో వున్నాయి. ఎనభై మిలియన్లకు పైగా వీడియో కాపీలు 38 భాషల్లో అమ్ముడుపోయాయట. దీన్ని యు.ఎస్.ఎల్. బానర్ కింద నిర్మించారు నిర్మాతలు నోషిర్ దేశాయి, భరత్‌సుందర్. దర్శకులు శక్తి సాగర్, అమృత్ సాగర్.

ఎం.ఏ.

ఫోటోలో 'అమర్ చిత్ర కథ'లో నారదుడు

ఉండును' అనుకుంది.

రఘురాం 'ఇంటి' డాబామీది పిట్టగోడమీద నిర్భయంగా కూర్చున్న ప్రసూనకి, తన ఇంటి డాక్యుమెంట్స్ అతని మొహంమీద నిర్భయంగా విసిరిపారేసిన ప్రసూనకి తన పేరు గుర్తొచ్చింది. తను మామూలు ప్రసూన కాదు, జ్ఞాన ప్రసూన. ఆ 'జ్ఞానమే' లేకుంటే వడిలి, వాడి, నేలరాలిన ప్రసూనం అయిపోయి ఉండును - అనుకుంటుంటే తిరిగి మరోసారి ఆమె వదనమంతా చిరునవ్వు వ్యాపించింది.

మాటిమాటికీ ఆమె ముఖంలో తళుకులా మెరిసే ఆ నవ్వు పిల్లలిద్దరికీ చాలా ఇష్టం.

ఒక అరగంటలో వాళ్లిద్దరూ పైకి వచ్చారు.

"అమ్మా! మన గార్డెన్ ఇల్లు అమ్మేస్తున్నామా?" అంది పాపాయి.

ఆ ఇంటికి చిన్న తోట ఉంది. అందుకే వాళ్లు దాన్ని అలా అంటారు.

"మనకి రెండు ఇళ్లు ఎందుకమ్మా?" అంటూ ప్రసూన ఆ విషయం కట్ చేసేసింది. 'పిల్లలకి ఎందుకూ ఈ సంగతులన్నీ చెప్పడం?' అనుకుంటూ.

"టిఫిన్ తిన్నారా?" అంది.

"మేం ముగ్గురం తిన్నాం. నువ్వు తినలేదని నీకోసం పైకి వచ్చాం!" అని వాళ్లు చెప్తుంటే, కనీసం వీళ్లకైనా ఈమాత్రం తెలుస్తోందే అనుకుంది.

"నాన్న ఎందుకో ఈ వేళ చాలా సంతోషంగా ఉన్నారు!" అంటూ వచ్చాడు బాబు.

"మరి నేనో?" అంది సరదాగా ఆమె.

"నువ్వు ఎప్పుడూ సంతోషమే! ఎవర్ గ్రీన్ మా అమ్మ!" అని ఆమె మెడచుట్టూ చేయి వేసింది పాప.

వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీ - ఫరవాలేదు, నూరు పూవులు వికసించి తీరుతాయి!' అనుకుంది ప్రసూన - రేపు తను చేయవలసిన పని గుర్తు చేసుకుంటూ.

● ● ●

ఉదయమే త్వరగా వంట పని ముగించేసింది. పిల్లలు వాళ్ల పనులు వాళ్లు చేసేసుకుని స్కూల్‌కి వెళ్లిపోయారు. రఘురాం రూంలోంచి బయటకు రాలేదు. తలుపు కొద్దిగా తెరిచి చూసింది. యథాప్రకారంగా షేర్ మార్కెట్ 'కొలత'లలో తలమునకలై ఉన్నాడు. తలెత్తి చూశాడు.

"ఏమిటి, మేడమ్?"

"నేను ఈరోజు ఒక గంట ముందుగా బయలుదేరుతున్నాను. మరో పని చూసుకుని అటునుంచి అటు బాంక్‌కి వెళ్లాలి!"

"నీదే ఆలస్యం!" అంటున్నాడు.

'అంటాడు. ఎన్నయినా అంటాడు ఇప్పుడు!' నవ్వుకుంటూ అనుకుంది.

రఘురాం డబ్బు పాడుచెయ్యడు, ఎక్కువ చేస్తాడు. పిల్లలకే మిగుల్చుతాడు. పాడుచెయ్యడం అంటే ఏమిటి అసలు? పిల్లలకి మిగిల్చే డబ్బుకి హద్దుగానీ, అంతంగానీ ఉన్నాయా లోకంలో? ... ఈ ఆలోచన వస్తే ఏదో అలజడి ...

ఆ ఇంటిని అమ్మాలన్న ఆలోచన రెండేళ్లుగా సాగుతోంది. ఈ ఇల్లు తర్వాత చౌకలో వస్తుంటే కన్నాడు. అంతకంటే హంగులు ఎక్కువ ఉండటం వల్ల ఇక్కడికి మారిపోవలసి వచ్చింది. ప్రసూనకి ఆనాడే స్పష్టమైంది అంతానూ.

ఇద్దరి మధ్య ఏర్పడిన అనుబంధాన్ని గౌరవించే సందర్భాలు జీవితమంతా వస్తూనే ఉంటాయి. ఆ ఇద్దరి మనుషుల హృదయాలలో ప్రేమ ఎలా వెలుగుతున్నదీ ఆ సందర్భాలలోని వారి ప్రవర్తనే చెప్పాలి. మనకు ఇష్టమైన ఆ మనిషితో కలిసి కొన్ని పొందుతాం. ఆ మనిషి లేనప్పుడు కూడా 'అవి' పొందెయ్యాలన్న ఉబలాటాలను కొన్నింటినైనా అరికట్టలేని ప్రేమ - అది - ఏం ఉపయోగం మనుషులకి??

ఆ గార్డెన్ ఇంట్లో సౌకర్యాలు లేవు. కానీ ఎన్ని జ్ఞాపకాలు? అవేవీ అతని హృదయాన్ని అంటలేదన్నమాట! సౌకర్యంకోసం మృదుమధురమైన జ్ఞాపకాలను వదిలెయ్యడం బండతనమే కాదు, అది తమవారిపట్ల, ఆ అనుబంధంపట్ల ఎంతో అపచారం. అది ప్రసూనకి తగిలిన అతి పెద్ద గాయం. ఆ ఇంటిని వెంటనే అమ్మకానికి పెట్టడం రెండవ గాయం.

ఆమె జీతం అంతా ఆ ఇంటికోసమే ఖర్చు చేశారు. ఒకరకంగా ఆ ఇల్లు అంతా ఇంచుమించు ఆమె శ్రమే!

"కానీ పది లక్షలకి పెంచేది నీకోసమే కదా!" అంటాడు అతను.

అతను మొద్దుబారాడు. 'ఎప్పుడూ మొద్దేనేమో!' అన్న ఆలోచన ఆమెలో ఇప్పుడిప్పుడు కలుగుతోంది.

ఆమె తన ప్రేమలో, ఇష్టంలో, అవతలినుంచి వచ్చే ప్రతి చిన్న అంశాన్నీ పెద్దదిగా చేసుకోవడంలో ఆమెను ఆమే మోసం చేసుకుంది. వసంతంలా అతనిని ఆక్రమించుకున్న ఆమె ప్రేమకి ఆ మొద్దు చిగిర్చింది అనుకుంది. కానీ అది తాత్కాలికమే!

గబగబా తయారైంది. భోజనం చేయలేదు. సంతోషంతో, ఆత్రుతతో కడుపు నిండిపోయినట్టు ఉంది. కాసిని పాలు తాగి, బయలుదేరింది.

● ● ●

'వికాలంగుల ఆశ్రమ పాఠశాల' పార్కింగ్ ప్లేస్‌లో బండి ఆపి, ప్రసూన ఆఫీసురూములోకి వెళ్లింది. లోపలికి వెళ్తుండగా ఆమెకు ఎక్కడో చదివిన మాటలు గుర్తుకొచ్చాయి. అర్థవంతమైన జీవితం, ప్రయోజనవంతమైన జీవితం - ఏది గొప్పది అని. అవి రెండూ రెండురకాలనుకుంది ఆరోజు. ఇద్దరి ప్రేమతో ఫలించిన జీవితమే అర్థవంతం అనుకుంది. అదే గొప్పది అని కూడా.

కానీ ఇప్పుడు తెలుస్తోంది - ఈ జీవితం ప్రయోజనవంతం అయితే అదే అర్థవంతం కావడం అని. అవి రెండూ ఒకటేనని. ఈ ఆలోచన ఆమెను స్థిమితపరిచింది.

ఆఫీస్ రూములో స్కూల్ డైరెక్టర్ జయారామన్ చక్రాల కుర్చీలోంచి తన డైరెక్టర్ కుర్చీలోకి అతి ప్రయాసతో మారబోతోంది. ప్రసూన చురుకుగా వెళ్లి ఆమెకు సాయం చేసింది పర్మిషన్ తీసుకుని.

జయారామన్ తమిళదేశ స్త్రీ. వికాలంగులైన పిల్లలకోసం ఇక్కడిదాకా వచ్చి పనిచేస్తోంది. ఆమె కష్టం ఆమెకు ప్రపంచాన్ని ప్రేమించడం నేర్పింది. ఆమె స్థిమితంగా కూర్చుని, ప్రసూనని కూర్చోమని సైగచేసి, ఒక్క నిమిషం కళ్లు మూసుకుని ధ్యానంలోకి వెళ్లింది. అయిదు నిమిషాల తర్వాత కళ్లు తెరిచింది. "చెప్పమ్మా, ఏమిటి నీ నిర్ణయం?" అని అడిగింది ఆమె.

ప్రసూన నవ్వుతూనే అంది - "మేడమ్! కిందటిసారి ముగ్గురు పిల్లల్ని అని చెప్పాను కదా! నా నిర్ణయం మారింది. మరో ఇద్దర్ని కలిపి అయిదుగురు పిల్లల్ని ఎడాప్ట్ చేసుకుందామనుకుంటున్నాను!"

జయ చాలా సంతోషంతో చెయ్యి చాపి ఆమె చెయ్యి అందుకుంది. "దేవుడు నీకు, నీ పిల్లలకు మేలు చేస్తాడు!" అంది.

"మేడమ్! ప్రతి నెలా అయిదువేల రూపాలయ చెక్కు మీ ఆఫీసుకి పంపే ఏర్పాటు చేస్తాను. నాకు ఒక్కమాటు పిల్లల్ని చూపించగలరా? ప్రతి ఆదివారం నేనూ, పిల్లలూ వచ్చి వాళ్లతో గడపాలనుకుంటున్నాను. ఆ అవకాశం ఉంటుందా?"

జయారామన్ బెల్ నొక్కి నౌకరుని పిలిచింది. "రామ్మోహన్‌గారికి చెప్పి వీరికి ఇద్దామనుకున్న పిల్లల్ని చూపించమను!" అని, "మీరు కోరినవారిలో మరో ఇద్దర్ని నేనే ఎంపికచేసి మీకు మళ్లీసారి చూపిస్తాను. ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వాళ్లని చూడండి. మీ ఇష్టం వచ్చినప్పుడు రావచ్చు!" అంది.

ప్రసూన ఆమెకి నమస్కరించి లేచింది.

ఆ ముగ్గురు పిల్లలూ - బ్లైండ్ సిస్టర్స్. వెళ్లగానే ఆమె చేతులు పట్టుకుని గుర్తుపట్టేశారు - "ఆంటీ! మీరు వచ్చారా! మీగురించి మాకు 'అమ్మ' రోజా చెప్పున్నారు!" అన్నారు వాళ్లు.

ప్రసూన వాళ్ల స్పర్శకి ఆశ్చర్యపోయింది. ఒక ఇమేజినేషన్‌తో ఉన్నారు వాళ్లు. ఆమెను ముట్టుకోగానే ఆమెలో ఆ ఇమేజినేషన్ పలికింది. ఎంత గొప్ప శక్తి ఉంది బుద్ధికి, లేదా హృదయానికి! అనుబంధానికి కావలసినది ఇదొక్కటే కదా! అనిపించింది ఆమెకి.

"నన్ను అమ్మా అని పిలవండి తల్లీ! ఆంటీ కాదు!" అని చెప్పింది వాళ్లకి. వాళ్ల అవసరాలు కనుక్కుంది.

అరగంట తర్వాత బాంక్‌కి వచ్చి కూర్చుంది. కష్టమర్స్ హడావుడి లేదు ఇంకా.

బాగ్‌లోంచి పాస్‌బుక్ తీసి చూసుకుంది. ఈ రెండేళ్లుగా ఇంట్లో జీతం ఇవ్వడంలేదు ఆమె. రఘురాంతో నిక్కచ్చిగా చెప్పేసింది. "నా తిండీ, పిల్లల తిండీ, అవసరాలూ నువ్వే చూడాలి. నేను ఇంతవరకూ ఇచ్చిన డబ్బు చాలు! అది నీ ఇష్టంవచ్చినట్టు చేసుకో!" అంటూ.

పెద్ద గొడవపెట్టేశాడు.

"గొడవ వద్దు. వేరే వెళ్లి ఉంటాను. పిల్లలు హాస్టల్‌లో ఉంటారు. నీ డబ్బు నీకే ఉంటుంది!" అంది.

రఘురాం జడిశాడు. అంతపనీ చెయ్యగలదు. ఆమెకు ఈ ఇంటిమీద, సౌకర్యాలమీద ఖాతరు లేదు. ఆమె వాటిమీద ఆధారపడి ఎప్పుడూ లేదు. ఆమె లేకపోతే, ఈ సంసారం సాగకపోతే తనకే గడవదు. ఇబ్బందుల్లో పడిపోతాడు. ఆ సంగతి అతనికి బాగా తెలుసు.

సంసారం పోతే నష్టం ఆడదానికంటే మగాడికే ఎక్కువ అన్న నిజం అతని అనుభవంలో అతనికి తెలిసింది. ఆ నిజానికి భయపడ్డాడు. అప్పటినుంచి ప్రసూనని చూస్తే అతనికి ఒకరకమైన భయం, మరొకవైపునుంచి అతనికే తెలియని ఆరాధనా మొదలయ్యేవి.

ప్రసూన ఆ రెండింటినీ గుర్తించింది. కానీ ఇప్పుడు అతనిపట్ల ఆమెకు ఏ మోహమూ లేదు. చాలా వెనుకబడిపోయాడు. ఆమెను మోహపెట్టే ఏ ఒక్క గుణమూ అతనిలో లేదు.

తన బాంక్ పాస్‌బుక్‌లో ప్రసూనకి పెద్ద అంకెలే కనబడ్డాయి. రేపు 'పిల్లలకి' కావాలసినవన్నీ కొనాలి అనుకుంది. తొందరలో ఇద్దరు పిల్లల్నీ తీసుకెళ్లి ఆ అయిదుగురు పిల్లలకీ పరిచయం చేసి తన కుటుంబాన్ని విస్తరింపచేయాలని అనుకోగానే ఆమె హృదయం ఒక్కమాటుగా అలవికాని ఆనందంతో నిండిపోయింది.

రెట్టించిన ఉత్సాహంతో జైలులాంటి కాష్‌కౌంటర్‌లో పని మొదలుపెట్టింది జ్ఞాన ప్రసూనాంబ.

■

